



<u>ప్రారంభానికి ముందు</u>

"ఆ అమ్మాయిని ఎక్కడో చూశాను" అన్నాడు సారథి.

ప్రసాద్ సారథి వైపు చూసి, తల తిప్పి అతను చూస్తున్న అమ్మాయి వైపు చూశాడు. వాళ్ళకి కుడి వైపు రెండు సీట్ల అవతల కూర్చొని మొబైల్ లో గేమ్ ఆడుతున్నాడు మూర్తి. గోవా ఎయిర్ పోర్ట్ లో కూర్చొని ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు ముగ్గురూ.

"నిజంరా... ఆ అమ్మాయిని ఖచ్చితంగా ఎక్కడో చూశాను." సారథి మళ్ళీ అన్నాడు. మూర్తి తల ఎత్తకుండా వంకరగా నవ్వాడు. మూర్తి నవ్వులో వ్యంగ్యం గుర్తించిన సారథి సంజాయిషి ఇవ్వడం మొదలుపెట్టాడు.

"అంటే నిజంగా కాదు. ఏదో టీ.వీ. సీరియల్లోనో, సినిమాలోనో.." సారథి మాటలకు ప్రసాద్ మళ్ళీ అటు వైపు చూశాడు. మూర్తి కూడా ఆ అమ్మాయిని పరీక్షగా చూసి చిన్నగా విజిల్ వేశాడు.

"అరే మామా.. అదేరా... నిన్న టీవీలో.. విడాకుల కేసు" పొడి పొడిగా మాట్లాడి గుర్తు చేశాడు మూర్తి.

"అవున్రా. నువ్వు చెప్తుంటే గుర్తొస్తోంది... టూత్ పేస్ట్ విడాకులు.." గట్టిగా నవ్వాడు సారథి. ప్రసాద్ చిరాగ్గా చూశాడు. అప్పటికే ఆ అమ్మాయి ఎటో వెళ్ళిపోయింది. స్పైస్ జెట్ విమానం మరో గంట లేటౌతుందంటూ ప్రకటన వినపడింది. దాంతో పాటే చుట్టుపక్కల నుంచి నిట్టూర్పులు కూడా. సారథి కూర్చున్న కుర్చీలోనే ఇంకాస్త ముందుకు జారాడు. ప్రసాద్ చదువుతున్న పుస్తకంలో ఆపేసిన పేజీ కోసం వెతుకుతున్నాడు

"అయినా అంత చిన్న విషయానికి విడాకులు తీసుకుంటారా?" సారథి మళ్ళీ ఆ అమ్మాయి విషయం ఎత్తాడు.

"కలికాలం బాబూ కలికాలం" వెటకారంగా అని నవ్వేశాడు మూర్తి.

"మనకి అవసరమా?" అన్నాడు ప్రసాద్ పుస్తకంలో నుంచి తల పైకెత్తి.

"ప్రతి దానికీ మనకి అవసరమా అంటావేరా? ఏదో టైమ్ పాస్ కి మాట్లాడచ్చుగా? అంతకన్నా చేసే గొప్ప పనేమైనా వుందా ఇప్పుడు?" సారథి చిరాకుపడ్డాడు

సమాధానంగా ప్రసాద్ చేతిలో పుస్తకాన్ని పైకెత్తి చూపించాడు కానీ మిగిలిన ఇద్దరూ ఆ విషయం పట్టించుకోలేదు. మూర్తి ఉత్సాహంగా ముందుకు జరిగాడు.

"అయితే ఇప్పుడు మనం టైమ్ పాస్ కి చర్చించబోయే అంశం – "భారతదేశంలో విడాకుల తీరూ తెన్ను – విత్ స్పెసిఫిక్ రెఫరెన్స్ టు మాలతి" అన్నాడు.

"వార్నీ... పేరు కూడా గుర్తుందే నీకు" సారథి కన్నుగొట్టాడు.

ప్రసాద్ పుస్తకం మూసి గట్టిగా నిట్టూరుస్తూ – "ఇంతకీ కేసేంటి?" అని అడిగాడు.

"ఆ అమ్మాయి పేరు మాలతి. విడాకులు తీసుకుందని నిన్న టీవీలో వచ్చింది. విడాకులకి కారణం తెలుసా? టూత్ పేస్ట్. వాళ్ళాయన టూత్ పేస్ట్ మధ్యలో నొక్కి వేసుకుంటాడట, ఈమెకేమో చివర్నుంచి నొక్కి వేసుకోవడం అలవాటట..." మూర్తి తనకి గుర్తొంచింది చెప్పాడు.

"సో.." కనుబొమ్మలు ఎగరేశాడు ప్రసాద్.

"సో ఏంటి సో... అది ఒక కారణమా? అంతమాత్రానికే విడాకులు తీసేసుకోవాలా? పేస్ట్.. ఆఫ్ట్రాల్ పేస్ట్.. ఎక్కడ నొక్కినా బయటికి బొక్కలోంచే కదా వచ్చేది" సారథి ఆవేశంగా అని నవ్వాడు.

"సమస్య చిన్నదో పెద్దదో అనుభవించేవాళ్ళకి తెలుస్తుంది. పాపం ఆ ఆమ్మాయికి ఏం సమస్య వచ్చిందో? నీకేం తెలుసు?" ప్రసాద్ వాదించాడు.

"రేయ్.. ఏంట్రా వీడు? గోవా వచ్చిన దగ్గర్నుంచి చూస్తున్నా... ప్రతి విషయంలో ఇలాగే మాట్లాడుతున్నాడు. నేను ఏం చెప్పినా ఇలాగే – "వాడి మనసులో ఏముందో నీకు తెలుసా?", "దాని మనసులో ఏముందో తెలుసా" అని వెటకరాలు..." సారథి మూర్తి వైపు తిరిగి అరిచాడు. మూర్తి అనూనయంగా చూశాడు.

"వెటకారం కాదురా... ఆ అమ్మాయికి ఇష్టం లేని పని అది. అలా కాదు ఇలా చెయ్యమని చెప్పే వుంటుంది. ఆమె భర్త ఒప్పుకోకపోయి వుండచ్చు... దాని వల్ల ఆ అమ్మాయికి అతను నచ్చక..."

"అమ్మాయికి అబ్బాయి నచ్చలేదని తెలుసు బాబూ... కానీ అందుకు కారణం చూడు ఎంత ట్రివియలో.." సారథి దాదాపు అరిచేశాడు.

"ట్రివియల్ నీకు... ఆ అమ్మాయికి కాదు." ప్రసాద్ స్థిరంగా అన్నాడు.

"గయిస్... ఇట్స్ ఓకే... ఈ మధ్య ఇట్లాంటివి ఎన్ని చూడటంలేదు? మొన్న ఎవరో ఒకామె రిమోట్ ఇవ్వటంలేదని కారణం చెప్పి విడాకులు తీసుకుంది. ఫేస్ బుక్ వదలని భర్త నుంచి విడాకులు ఇంకెవరో తీసుకున్నారని చదివాను. ఎప్పుడూ కూరలో ఉప్పెక్కువ వేస్తుందని భార్యని చంపేసిన భర్తలు కూడా వున్నారు. ఇలాంటి ట్రివియల్ థింగ్స్ చాలా వుంటాయి..." మూర్తి ఇద్దర్నీ సమాధానపరిచేలా చెప్పాలని ప్రయత్నం చేశాడు.

"నో... ట్రివియల్ అనే మాటని నేను ఒప్పుకోను. ఏదీ ట్రివియల్ కాదు. నీకు ట్రివియల్ అయితే కావచ్చు. కానీ వాళ్ళకి మాత్రం కాదు. మనుషుల్ని చంపేయడానికి, జీవితాన్ని ప్రభావితం చేసే నిర్ణయాలు తీసుకోడానికి కూడా సిద్ధపడుతున్నారు అంటే అది వాళ్ళ జీవితంలో ఎంత ముఖ్యమైనది అయ్యుంటుంది. " ప్రసాద్ పూర్తి చెయ్యకముందే సారథి అందుకున్నాడు.

"అయితే నన్నిప్పుడు ఏం చెయ్యమంటావ్? వెళ్ళి ఆమెకి కంగ్రాచులేషన్స్ చెప్పి రమ్మంటావా? టూత్ పేస్ట్ ట్యూబ్ లో నుంచి పేస్ట్ బయటికి రప్పించడం ఎలా? ఎక్కడెక్కడ నొక్కాలి? అన్ని విషయం గురించి ఆమెతో చర్చించి టీవీలో వెయ్యమంటావా?" సారథి ఆవేశంగా అరిచాడు. మూర్తి కిసుక్కున నవ్వాడు.

"అవసరంలేదు. జస్ట్ ఎంపథైస్. సహానుభూతి చూపించు."

"ఎందుకు చూపించాలి? నేను కూడా పేస్ట్ కావాలంటే ట్యూబ్ మధ్యలోనే నొక్కుతాను. కాబట్టి నేను ఆమె భర్తకి సహానుభూతి, సానుభూతి చూపిస్తాను. నువ్వు ఆమెకి సపోర్ట్ చేస్తావా? నువ్వు కూడా హండ్రెడ్ పర్సెంట్ ప్రతిసారీ ట్యూబ్ కిందే నొక్కి పేస్ట్ బయటికి తీస్తావా?"

"నేను ఎలా నొక్కుతాను అన్నది కాదు ప్రశ్న. ఆమెని సపోర్ట్ చెయ్యడం కూడా నా వుద్దేశ్యం కాదు. కానీ ఆమె చెప్పిన దాంట్లో కూడా పాయింట్ వుంది"

మాటలు క్రమంగా వాదంలోకి మారుతున్నాయని మూర్తి గ్రహించాడు.

"ఒకే.. రిలాక్స్ గయిస్... కూల్ డ్రింక్ తీసుకురానా ముగ్గురికీ?" అడిగాడు మాట మర్చేప్రయత్నంలో. మిగిలిన ఇద్దరూ ఒకరినొకరు చూసుకుంటూనే తలలూపారు. "రెండు నిముషాలలో వచ్చేస్తా" అంటూ పరుగెత్తాడు మూర్తి.

దాదాపు నిముషం సేపు ప్రసాద్, సారథి మాట్లాడుకోలేదు. సారథే మళ్ళీ నోరు తెరిచాడు.

"నువ్వు ఆర్గ్యుమెంట్ చెయ్యాలని డిసైడ్ చేసుకొని నాతో మాట్లాడుతున్నావు. మూడు రోజుల నుంచి ఇదే బిహేవియర్... గోవా వచ్చిన దగ్గర్నుంచి.. ఇనఫ్ ఈస్ ఇనఫ్.."

"వాట్? నేను ఆర్గ్యుమెంట్ చెయ్యాలని మాట్లాడుతున్నానా? అనవసరంగా నా మీద కంప్లైంట్ చెయ్యకు" విసురుగా పుస్తకం పక్కన పడేశాడు ప్రసాద్.

"నేనేం కంప్లైంట్ చెయ్యట్లేదు. ఫాక్ట్ చెప్తున్నాను. మామూలుగా నీ బిహేవియరే అంత. బట్ ఒక విషయం గుర్తుంచుకో– నాతో ఆర్గ్యుమెంట్ మానేస్తే మంచిది"

"నువ్వు కూడా నా గురించి మాట్లాడటం మానేస్తే మంచిది. నాకేం నీతో వాదించాలన్న సరదా లేదు. నువ్వేమంత మేధావివీ కాదు... నా అభిప్రాయం చెప్పాను. మూడు రోజుల్నించి కూడా అంతే. నాకు నచ్చింది చేస్తున్నాను. నాకు అనిపించింది చెప్తున్నాను."

"అదే.. నువ్వనుకునేది, నీకు నచ్చేది ప్రతిసారీ నా మనసులో వున్నదానికి వ్యతిరేకంగా ఎందుకు వుంటోంది.."

"ఏమో... నాకేం తెలుసు?"

"అవున్లే.. నీకేం తెలుసు... అడ్డంగా వాదించమంటే వాదించగలవు కానీ..."

"మళ్ళీ నా గురించి మాట్లాడుతున్నావ్.."

"అవును ప్రాబ్లం నీలో వుంటే నీ గురించి కాక ఆ అమ్మాయి గురించి మాట్లాడతానా.."

"ప్రాబ్లం నాలో లేదు.. నీలో వుంది"

"ఏంట్రా.. ఏంటి నాలో ప్రాబ్లం... అసలు ఏంటి చెప్పు...?" సారథి అరుస్తుండగానే మూర్తి వచ్చాడు. వెంటనే విషయం అర్థం చేసుకున్నాడు. మూడు రోజుల సహచర్యంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడోప్పుడు వస్తుందని ఊహిస్తూనే వున్నాడు.

"సారథి... ఏంట్రా మామా ఇది... ముందు కూర్చో.. కూ.. ర్చో..." సారథి కూర్చున్నాడు. మూర్తి చేతిలో వున్న ట్రే ముందుకు చాచాడు. సారథి అందులో వున్న కూల్ డ్రింక్ కప్ మౌనంగా అందుకున్నాడు. ప్రసాద్ వైపు తిరిగాడు మూర్తి. అతను కూడా కప్ అందుకున్నాడు.

"మనం గోవా వచ్చింది ఎంజాయ్ చెయ్యడానికి... చేశాం. వెళ్ళే ముందు ఇలా మూడ్ పాడుచేసుకోవాలా?" అన్నాడు ప్రసాద్ తో. అతను సమాధానంగా ఏదో చెప్పబోయి ఆగిపోయాడు. ముగ్గురూ మాట్లాడకుండా కూల్ డ్రింక్ కప్స్ ఖాళీ చేశారు. ఫ్లైట్ ఇంకో గంట లేట్ అని ప్రకటన వినిపించింది. కొంత మంది ప్రయాణికులు అప్పటికే స్పైస్ జెట్ సిబ్బందితో గొడవపడుతున్నారు.

మూర్తి తనకి రెండు వైపుల వున్న స్నేహితుల్ని మార్చి మార్చి చూశాడు. ప్రసాద్ మళ్ళీ పుస్తకంలో లీనమైపోయాడు. సారథి ఎటో చూస్తూ ఏదో ఆలోచిస్తున్నట్లుగా వున్నాడు. మూర్తికి అప్రయత్నంగా నవ్వొచ్చింది. కిసుక్కున నవ్వేశాడు.

ప్రసాద్ పుస్తకం పక్కన పెట్టి, మూర్తి వైపు తిరిగి ఏమిటన్నట్లు కళ్ళు ఎగరేశాడు. సారథి కూడా కళ్ళతోనే ప్రశ్నార్థకాలు వేశాడు.

"ఎవరో అమ్మాయి. ఆ అమ్మాయి విడాకులకి ఏదో రీజన్. ఆ రీజన్ ట్రివియలా కాదా అని మీ ఇద్దరూ కొట్టుకోవడం. మీ గొడవకి కారణమే ట్రివియల్ గా లేదూ..." నవ్వాడు.

"నో.. ఇటి ఈజ్ నాట్ ట్రివియల్... వాడు ఈ ఒక్క విషయంలోనే కాదు... ప్రతి విషయంలో నాతో ఇలాగే మాట్లాడుతున్నాడు. అదంతా వుంది నాకు కోపం రావటం వెనుక."

"అది మాత్రం? ఇద్దరు ఫ్రెండ్స్ కొట్టుకునేంత గొప్ప కారణమా?" మూర్తి మళ్ళీ అన్నాడు.

"అది అనుభవించినవాడికే అర్థం అవుతుంది. నీకు చెప్పినా అర్థం కాదు..." సారథి అనేసి పక్కకు తల తిప్పుకున్నాడు.

"ఎగ్జాట్లీ... అదే కదా నేను చెప్పింది. ఆ అమ్మాయి విషయం కూడా అంతే. అనుభవించింది కాబట్టి ఆ కష్టమేమిటో ఆ అమ్మాయికి మాత్రమే తెలుసు. నీకు అది చులకనగా కనిపించవచ్చు..." ప్రసాద్ ఆ మాటల్ని తనకి అనుకూలంగా మలుపుకున్నాడు.

సారథి ఏదో చెప్పబోయి ఆగిపోయాడు. ఒక అర నిముషం నీళ్ళు నమిలాడు. చివరికి లేచి నిలబడి అన్నాడు –

"నేను ఆ అమ్మాయిని కలిసేసి వస్తా.."

"ఏ అమ్మాయిని?" మూర్తి అడిగాడు. అప్పటికే సారథి నిలబడి కదలబోతున్నాడు.

"అదే ఆ టూత్ పేస్ట్ విడాకులు... మాలతి.."

వెనుక మూర్తి కంగారుగా పిలుస్తున్నా వినిపించుకోకుండా వడివడిగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. ప్రసాద్ నవ్వుకున్నాడు.

>>ooo<<

<u>ప్రారంభం</u>

1

సారథికి మగతగా వుంది.

ఏదో లీలగా మాత్రమే జ్ఞాపకం వస్తోంది. ఆ అమ్మాయి... అదే ఆ మాలతి...

పరిచయం చేసుకోడానికి తన చేతిని చాచింది.

ఏదో తేడా వుంది.

ఆ అమ్మాయి కన్ను ముక్కు తీరు అంతా బాగానే వుంది. ముఖంలో చిరునవ్వు కూడా బాగానే వుంది.

ఎక్కడో ఏదో తేడా... చెయ్యి... అవును చేతిలోనే తేడా వుంది.

ఆ అమ్మాయి కరచాలనం చెయ్యడానికి ముందుకు చాచింది కుడి చేతిని కాదు. ఎడమ చేతిని. ఆ అమ్మాయిది ఎడమచేతి వాటం.

సారథి తడబడ్డాడు. అతను ముందుకు చాచిన కుడి చేత్తో ఆమె ఎడమ చేతిని అందుకోని కరచాలనం చెయ్యడం కష్టమని అర్థం అయ్యి, చెయ్యి మార్చి, తను కూడా ఎడమ చేతిని ముందుకు చాచాడు.

ఎడమ చెయ్యి, ఎడమ చెయ్యి కలుసుకున్నాయి.

సుతారంగా చేతిని ఊపాడు. ఆమె నవ్వింది.

ఏదో మాట్లాడింది. తనూ మాట్లాడాడు. చాలా సేపు.

కరిగిపోతున్న మంచులా జ్ఞాపకం కరిగిపోతోంది. కలగపులగంగా మారిపోతోంది.

ఎవరో అమ్మాయి. పేరు తెలుసు. కానీ గుర్తుకురావటం లేదు.

ఆమె నవ్వింది. ఎడమ చెయ్యి చాచింది.

కరచాలనం. మాటలు... ఏవో మాటలు. చాలా సేపు.

మళ్ళీ మంచు కరిగినట్లు. కథ మొదటికొచ్చినట్లు.

ఎడమ చెయ్యి... ఎవరిదో ఎడమ చెయ్యి... అది ఆడా? మగా? తెలియట్లేదు.

కానీ... ఆ చెయ్యి.. ఆ చెయ్యి మాత్రం ఎడమ చెయ్యే...

ముందుకు చాచి.. అందుకుంటూనే ఏదో...

మంచు కరిగి.. దుప్పటి తొలగి. క్రమంగా ఇంకిపోతున్న జ్ఞాపకంలో మిగిలిన శకలం –

ఎడమ చెయ్యి... ముందుకు... ముందుకు వస్తూ ముఖం దగ్గరగా... ఎడమ చెయ్యి..

చప్పున మెలకువ వచ్చింది.

★★★

సారథి కళ్ళు తెరిచాడు.

మొదట కనపడింది ఆకాశం. వినపడింది సముద్రపుహోరు.

ఎక్కడున్నానా అని ఆలోచించలేదు. "నేను ఎవర్ని?" అని ఆలోచించాడు.

ఆకాశంలో మబ్బులు రకరకాల ఆకారాలలో కనపడుతున్నాయి. కొన్ని తెలిసినవి, కొన్ని తెలియనివి. తెలియని మబ్బుల్ని వదిలి, తెలిసిన మబ్బుల్లో కనపడుతున్న ఆకారాన్ని వింతగా గమనించాడు. ఓ మబ్బు మనిషిలాగే వుంది. ఎవరో తెలిసిన మనిషే అతను.

చేతిలో కర్ర వున్నట్టు అర్థం అవుతోంది. బహుశా వయసుమళ్ళిన వాడై వుంటాడు. ముతక పంచె కూడా ఆ విషయాన్ని బలపరుస్తోంది.

అతనే... అవును అతనే... గాంధీ.. మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీ...

బాపూజీ... జాతిపిత... స్వతంత్రోద్యమ నేత గాంధీ... అవును.. గాంధీ.. ఆ ఆకారం క్రమంగా దగ్గరౌతుండగా ఆ మబ్బు చాటున వున్న సూర్యుడు ఒక్కసారిగా తీక్షణంగా ప్రకాశించడంతో కళ్ళు మూసుకున్నాడు సారథి. కళ్ళు తెరువబుద్ధి కావటం లేదు. ఏదో మైకం కమ్మినట్లు... మగతగా... మత్తుగా... అది కలో ఊహో తెలియని ప్రపంచంలోకి జారుకున్నాడు.

"ఇన్ క్విలాబ్ జిందాబాద్.."

వందలాది మంది సైనికుల దుస్తుల్లో ముందుకు సాగుతున్నారు. వాళ్ళ వంటి మీద ఆకుపచ్చ దుస్తులు. చేతుల్లో తుపాకులు. వీళ్ళందరినీ ముందుకు నడిపిస్తున్న ఒక నాయకుడు

"ఇన్ క్విలాబ్ జిందాబాద్.." ఆ నాయకుడు గర్జించాడు. ఒక్కసారి కొన్ని వందల గొంతుల్లో ఆ నినాదం ప్రతిధ్వనించింది. ఆ నాయకుణ్ణి ఎక్కడో చూసినట్లు వుందనిపించింది సారథికి. ఎంత ఆలోచించినా స్ఫురించడం లేదు. ఎవరతను?

బోస్ దాదా...!!

అవును అతనే... సుభాష్ చంద్ర బోస్... అతనే.. కలలో జరిగినట్లు... మత్తులో కనపడినట్లు... సుభాష్ చంద్ర బోస్!!

సారథి ఇంకా కళ్ళు తెరువలేదు. కళ్ళముందు కనపడుతున్న దృశ్యం మారిపోయింది. ఇప్పుడు సైనికులు ఎవరూ కనపడటంలేదు. సుభాష్ చంద్ర బోస్ ఒక్కడే కనిపిస్తున్నాడు. ఇప్పుడు అతని ఒంటి మీది ఆలివ్ గ్రీస్ దుస్తులు లేవు. తెల్లటి కుర్తా పైజామా. ఆ పైన మరో తెల్లటి శాలువా. శాంతి కపోతంలా వున్నాడు. ముందుకు నడుచుకుంటూ సారథి దగ్గరకు వచ్చాడు.

ఏదో చెప్తున్నాడు. మాట్లాడలని ప్రయత్నం చేస్తున్నాడు. కానీ ఏమీ వినపడటంలేదు.

తలంతా భారంగా... ఎవరో సుత్తులతో మోదుతున్నట్లు, సూదులతో గుచ్చుతున్నట్లు... తలంతా బాధ.

సారథి కళ్ళు తెరిచాడు.

## (జరగబోయే జగన్నాటకం వచ్చే మాసం)

COMMENTS